పీఏసీఎస్‌లకు డిజిటల్ హంగులు

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు డిజిటల్ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే కోవూరు మండలంలోని పడుగుపాడు పీఏసీఎస్‌తో పాటు తోటపల్లిగూడూరు మండలంలోని పేడూరు పీఏసీఎస్‌లు పైలట్ ప్రాజెక్టుగా కంప్యూటరీకరణను పూర్తి చేశారు. ఇవి సత్ఫలితాలు ఇవ్వడంతో ఈనెల 30వ తేదీకి జిల్లాలోని అన్ని సహకార సంఘాలను డిజిటలైజేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- పైలట్ ప్రాజెక్ట్‌గా రెండు పీఏసీఎస్‌ల్లో పూర్తి
- పారదర్శకత, నాణ్యమైన సేవలే లక్ష్యంగా అడుగులు


పీఏసీఎస్‌లో చేపడుతున్న డిజిటలైజేషన్ పనులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : జిల్లాలో ఉన్న 78 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్)లను పూర్తిస్థాయిలో కంప్యూటరీకరణ చేసేందుకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ కార్యక్రమం వల్ల సహకార సంఘాల్లో పారదర్శకత, జవాబుదారీతనం, సభ్యుల పూర్తి వివరాలు, సేవలను వేగవంతంగా, సమర్థవంతంగా పొందవచ్చు.

పూర్తి వివరాల నమోదు

పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయడం ద్వారా సంఘంలోని ప్రతి సభ్యుని వివరాలు కంప్యూటర్‌లలో నమోదు చేస్తారు. దీంతో వ్యాపార లావాదేవీలు, సేవల వివరాలు పూర్తిస్థాయిలో నమోదవుతాయి. రానున్న రోజుల్లో పీఏసీఎస్‌లు డీసీసీ బ్యాంకు, ఇతర బ్యాంకులతో కోర్‌బ్యాంకింగ్ కార్యక్రమాలు చేపట్టే వీలు ఉంటుంది. పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేసే ప్రక్రియపై రాష్ట్ర ఉన్నతాధికారులు గతనెలలో జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, డీసీఓలతో ఆన్‌లైన్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

జిల్లాలో మొత్తం 78 పీఏసీఎస్‌లు ఉండగా, వీటిలో 3,37,618 మంది సభ్యులుగా ఉన్నారు. కంప్యూటరీకరణ వల్ల మొత్తం సభ్యుల వివరాలు పూర్తిస్థాయిలో డిజిటల్‌గా మారుతుంది. సహకార చట్టాన్ని అనుసరించి సొంత భూమి కలిగిన వారు, కౌలుభూమిని సాగు చేస్తున్న వారు సభ్యులుగా అర్హత కలిగి ఉంటారు. వారి భూముల వివరాలు కూడా నమోదవుతాయి. దీనివల్ల నిధుల దుర్వినియోగం అరికట్టడంతో పాటు, పారదర్శకత పెరుగుతుంది. అంతేకాక కోర్‌బ్యాంకింగ్‌కు పీఏసీఎస్‌లు అనుబంధంగా ఉండి ప్రతి పీఏసీఎస్ పంచాయతీ, మండల కేంద్రాల్లో బ్యాంకు కార్యకలాపాలు కొనసాగిస్తాయి. సంఘ సభ్యులకు అన్నిరకాల ఆన్‌లైన్ సేవలు అందుతాయి.

నెలాఖరుకు..

జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద పడుగుపాడు, పేడూరు పీఏసీఎస్‌లు గతనెల ఆగస్టు 15లోపు కంప్యూటరీకరణ పనులు పూర్తయ్యాయి. సెప్టెంబర్ 30వ తేదీలోపు అన్ని పీఏసీఎస్‌లు కంప్యూటరీకరణ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రతిరోజూ పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేయాలని సమీక్షలు నిర్వహిస్తున్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



సెప్టెంబర్ 30వ తేదీ నాటికి జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లు పూర్తి కంప్యూటరీకరణ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అందుకు పీఏసీఎస్‌ల సీఈఓలు, డీసీసీ బ్యాంకు సూపర్‌వైజర్లు, మేనేజర్లు, సహకారశాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తాం. ఈ విషయంలో ఎవరైనా అలసత్వం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు.

– గుర్రప్ప, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ)

కంప్యూటరీకరణపై సమీక్ష

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కందుకూరు డివిజన్‌లోని వాణిజ్య బ్యాంకులకు అనుసంధానం చేసిన 15 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని సభ్యుల వివరాలను త్వరితగతిన కంప్యూటరీకరణ చేయాలని డీసీఓ గుర్రప్ప ఆదేశించారు. ఆయన తన కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్ లాంటి వివరాలను పొందుపరచాలని తెలిపారు. సమీక్ష సమావేశంలో ప్రకాశం జిల్లా డీసీసీబీ సీఈఓ కోటిరెడ్డి, కావలి, కందుకూరు డివిజనల్ సహకార అధికారులు యలమందరావు, రవిచంద్రారెడ్డి, పీఏసీఎస్ సభ్యులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీసీఓ

రత్నం విద్యార్థిని ప్రతిభ


విద్యార్థినిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

నెల్లూరు (టౌన్) : డా.కిశోర్‌రత్నం స్కూల్ విద్యార్థి జీవీఎస్ దీక్షితాచౌదరి కూచిపూడి నాట్య ప్రదర్శన చేసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సాధించారని ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా తెలిపారు. స్థానిక ఏసీనగర్‌లోని రత్నం స్కూల్‌లో శుక్రవారం ఆయన విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల మొదటి వారంలో వారణాసిలో జరిగిన నృత్య ప్రదర్శనకు గిన్నీస్‌లో స్థానం లభించిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు శ్రీనివాసులు, లక్ష్మీదివ్యశ్రీ, పాల్గొన్నారు.

రూ.5 లక్షల చెక్కు అందజేత



నెల్లూరు (టౌన్) : వరద బాధితుల కోసం రత్నం విద్యాసంస్థల అధినేత వేణుగోపాల్ కుమారుడు సాయి రోహిత్ దాతృత్వాన్ని చాటారు. విజయవాడలో సీఎం చంద్రబాబును శుక్రవారం కలిసి సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.5 లక్షల చెక్కును అందజేశారు.

క్లుప్తంగా

భగవద్గీత సదస్సు రేపు

నెల్లూరు(బృందావనం) : పాత మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద సుమబిందు సుగుణాలయంలో ఆదివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 'భగవద్గీత సదస్సు' జరుగుతుందని నిర్వాహకుడు పెండెల సుబ్రహ్మణ్యం శుక్రవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యునాని డిస్పెన్సరీని వినియోగంలోకి తేవాలి


డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట) : మర్రిపాడు మండలం నందవరంలో ఉన్న ప్రభుత్వ యునాని డిస్పెన్సరీని వినియోగంలోకి తీసుకురావాలని నెల్లూరు ఐయూఎంఎల్ పార్టీ నాయకులు డీఆర్వో లవన్నను కోరారు. ఈ మేరకు వారు కలెక్టరేట్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత ఏడేళ్ల నుంచి డిస్పెన్సరీ మూతపడి ఉందని తెలియజేశారు. పార్టీ మీడియా ఇన్‌చార్జి మహ్మద్ హసన్‌బేగ్, మర్రిపాడు మండల ఇన్‌చార్జి సయ్యద్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



నెల్లూరు (టౌన్) : స్థానిక నవాబుపేట చినబాలయ్యనగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ప్రాచీన కవుల పరిచయాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం జాస్మినమ్మ, హిందీ టీచర్ నాగేశ్వరమ్మ, ఉపాధ్యాయులు ప్రసన్నలక్ష్మి, విజయభాస్కర్, ముస్తాక్, బ్రహ్మయ్య, రత్నమ్మ, కమలమ్మ, రాజా పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ


హరనాథపురం కూడలి సమీపంలో వృథాగా పోతున్న తాగునీరు

నెల్లూరు(బారకాసు) : నగరంలోని హరనాథపురం కూడలి సమీపంలో ఉన్న ప్రధాన పైప్‌లైన్ రెండు రోజులకోసారి లీకేజీకి గురవుతోంది. దీనికి మరమ్మతులు చేసినా ఫలితం ఉండడం లేదు. దీంతో తాగునీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల నిరసన



నెల్లూరు సిటీ : నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో రిటైర్డ్ ఉద్యోగులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 స్కీమ్ ద్వారా రిటైర్డ్ ఉద్యోగులకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎంకే రెడ్డి, సంఘ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి, గౌరవాధ్యక్షులు శంకరయ్య, వీపీ నరసింహారెడ్డి, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

తోటపల్లిగూడూరు: మండలంలోని చింతోపు గ్రామంలో గురువారం రాత్రి జరిగిన దాడుల ఘటనకు సంబంధించి ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వీరేంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. చింతోపు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు లేబూరు మహేష్, జక్కం తేజ, నెల్లంబాక గోపి, జక్కం పెంచలమ్మ, జక్కం నిర్మలపై పాతకక్షలతో టీడీపీ చెందిన మనుబోలు చంద్రశేఖర్, కోడి నరసయ్య, కోడి నివాస్, తురకా ఏడుకొండలు మరికొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు టీడీపీకి చెందిన మనుబోలు చంద్రశేఖర్, తురకా ఏడుకొండలు, పైనం కోటేశ్వరరావు, ఎండ్లూరు నరేంద్ర, ఉండ్రాళ్ల పృథ్వీ, కోడి నివాస్, కోడి నరసయ్య, కోడి రామమోహన్‌పై కేసు నమోదు చేశారు. కాగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తమపై దాడి చేశారంటూ మనుబోలు చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. అలాగే ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

భక్తిశ్రద్ధలతో గుంజ ప్రతిష్ట



నెల్లూరు(బృందావనం) : కరెంటాఫీస్ సెంటర్ సమీపంలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని 'గుంజ ప్రతిష్ట' కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ జె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా 'స్తంభ ప్రతిష్ట' కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, మాజీ మేయర్ భానుశ్రీ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

22 నుంచి మహా రథయాత్ర


మాట్లాడుతున్న మహారుద్రస్వామి

నెల్లూరు(బారకాసు) : శ్రీవారాహి మహా రథయాత్రను ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు శ్రీ ఆదిపరాశక్తి టెంపుల్ ట్రస్ట్ ఉపాసకుడు మహారుద్రస్వామి తెలిపారు. స్థానిక జర్నలిస్ట్ భవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వారాహి మహా రథయాత్ర ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. తొలిరోజు తిరుపతి పట్టణంలో ప్రారంభమై నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, అనకాపల్లి వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. వారాహి యాత్రలో పాల్గొని సేవ చేయాలనుకునే భక్తులు పూర్తి వివరాల కోసం 94922 47456 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు నిఖిలేష్ నాయుడు, సుధారాణి, మణి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ కిసాన్ మోర్చ నాయకులు

నెల్లూరు(దర్గామిట్ట) : వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పిస్తూ రైతులను ఆదుకోవాలని కలెక్టర్ ఆనంద్‌కు ఆయన కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను సాకుగా చూపి రూ.23 వేలకు కొనుగోలు చేయాల్సిన ధాన్యాన్ని రూ.6 వేలు తగ్గించి మిల్లర్లు రైతులను నిలువునా ముంచుతున్నారన్నారు. సోమశిల జలాశయంలో 50 టీఎంసీల నీరు నిల్వ ఉన్న తరుణంలో వెంటనే ఐఏబీ సమావేశం ఏర్పాటు చేసి కాలువలకు నీటి విడుదల చేయాలన్నారు. కాలువల పూడిక తీయించాలని, చెరువులకు మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చేవూరి వినయ్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై పోటీలు


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో డీఈఓ, టీచర్లు

నెల్లూరు (టౌన్) : 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని యువత చూడబోతుందని డీఈఓ రామారావు అన్నారు. దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్‌లో విజన్ ప్లాన్ ఆఫ్ స్టేట్ ఇన్ వికసిత్ భారత్ 2047 అనే అంశంపై విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలను శుక్రవారం నిర్వహించారు. వక్తృత్వ పోటీల్లో ప్రథమ బహుమతి బి.లాలస (జెడ్పీహెచ్‌ఎస్, చెన్నపల్లిపాళెం), ద్వితీయ బహుమతి పి.జాహ్నవి(జెడ్పీహెచ్‌ఎస్ వేగూరు), తృతీయ బహుమతి చరిష్మా (జెడ్పీహెచ్‌ఎస్ దర్గామిట్ట) విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి ఎ.నిరంజన్ (డీసీఆర్ జెడ్పీహెచ్‌ఎస్ దర్గామిట్ట), ద్వితీయ బహుమతి ఎస్.కార్తీక్(జెడ్పీహెచ్‌ఎస్, మొగళ్లూరు), తృతీయ బహుమతి టి.యషీల (డీసీఆర్ జెడ్పీ స్కూల్ దర్గామిట్ట) విజేతలుగా నిలిచారు. వీరికి జ్ఞాపిక, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి, హెచ్‌ఎం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ కస్టడీకి జయవర్ధన్

నెల్లూరు(క్రైమ్) : సంతకాల ఫోర్జరీ కేసులో జిల్లా కారాగారంలో రిమాండ్‌లో ఉన్న పి.జయవర్ధన్‌ను నాలుగు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతినిస్తూ శుక్రవారం కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. వివరాల్లోకి వెళ్తే.. నగరపాలక సంస్థ పూర్వ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో జయవర్ధన్‌పై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న ఆయన ఈనెల 10న కోర్టులో లొంగిపోగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసులో వివరాలను రాబట్టేందుకు జయవర్ధన్‌ను కస్టడీకి అనుమతించాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు నాలుగు రోజుల కస్టడీకి అనుమతించడంతో శనివారం జయవర్ధన్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకోనున్నారు.

హుండీ కానుకల లెక్కింపు



నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఈఓ, జిల్లా దేవదాయశాఖ అధికారి జె.శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. ఈ ఏడాది జూన్ 19 నుంచి సెప్టెంబర్ 13వ తేదీ వరకు భక్తులు కానుకల రూపంలో స్వామివారికి రూ.5,07,081 సమర్పించారన్నారు.

ఇంటి స్థలాలు కేటాయించాలని వినతి

నెల్లూరు(దర్గామిట్ట) : జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కలెక్టర్ ఆనంద్‌కు జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ జిల్లా కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వారు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవితేజ, జిల్లా అధ్యక్షుడు నరేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణ, పలువురు నేతలు ఉన్నారు.

పెన్షనర్ల సర్వసభ్య సమావేశం రేపు

నెల్లూరు(బృందావనం) : స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశం ఈనెల 15వ తేదీ సాయంత్రం 4 గంటలకు బీవీనగర్‌లోని పెన్షనర్ల సంక్షేమ భవనంలో జరుగుతుందని అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్‌ఎం.గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి శుక్రవారం తెలిపారు. ఈ సమావేశంలో పెన్షనర్ల సమస్యలను చర్చించడంతో పాటు 'ఇంజినీర్స్ డే' నిర్వహణ, విశ్రాంత ఇంజినీర్లకు సన్మానం జరుగుతుందన్నారు. జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, అసోసియేషన్ నిర్వాహకులు, ఆఫీస్ బేరర్స్, కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారులు, టెక్నికల్ టీమ్ మెంబర్స్ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

గూగుల్ డెవలపర్ క్యాంపస్‌కు నారాయణ విద్యార్థి

నెల్లూరు (టౌన్) : గూగుల్ డెవలపర్ గ్రూప్ ఆఫ్ క్యాంపస్‌కు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఫైనలియర్ విద్యార్థి ఆర్.నాగసాత్విక్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థి నాగసాత్విక్‌ను డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, సీఎస్ఈ హెడ్ సి.రాజేంద్ర అభినందించారు. కార్యక్రమంలో కోడింగ్ క్లబ్ ఇన్‌చార్జి రామ్మోహన్ పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి


పాత ఎల్లంటి గ్రామంలో..


డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో..


బుజబుజనెల్లూరులో..

నెల్లూరు(అర్బన్) : స్థానిక హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం జాతీయ నేత సీతారాం ఏచూరికి జనవిజ్ఞాన వేదిక నాయకులు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాప సభ నిర్వహించారు. ఆయన సేవలను ఆ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉదయభాస్కర్, కృష్ణారెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ రఫీ, ఎమ్వీ చలపతి, విద్యాచరణ్, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు అంకయ్య, రమేష్, మాదాల రాము, కృష్ణ, విద్యాధర్, కిశోర్, జానకిరామయ్య పాల్గొన్నారు.

బుజబుజనెల్లూరులో..

బుజబుజనెల్లూరులోని సుందరయ్య గ్రంథాలయం వద్ద సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ నియోజకవర్గ కార్యదర్శి కొండా ప్రసాద్, డివిజన్ కార్యదర్శి కృష్ణమూర్తి, నాయకులు అచ్చి తిరుపాలు, రవి, కొండయ్య, హరిబాబు, సుమంత్, మస్తాన్, నజీర్, హస్మి, మస్తానయ్య పాల్గొన్నారు.

- నెల్లూరు సిటీ : రూరల్ మండలం పాత ఎల్లంటి గ్రామంలో కామ్రేడ్ సీతారాం ఏచూరికి సీపీఎం నేతలు నివాళి అర్పించారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, మాజీ సర్పంచ్‌లు పి.సుబ్రహ్మణ్యం, వనం రామచంద్రయ్య పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత


విద్యార్థులు సేకరించిన నిత్యావసర సరుకులు

నెల్లూరు (టౌన్) : విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిత్యావసర సరుకుల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, దుప్పట్లు, టవల్స్ తదితర వాటిని సేకరించి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సభ్యులకు అందజేశారు. అనంతరం ప్రిన్సిపల్ గిరి మాట్లాడుతూ కళాశాల విద్యార్థి జ్యోత్స్నకుమారి 50 కేజీల బియ్యం అందజేసిందన్నారు. ఈ సరుకులను యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగానికి అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ అధికారులు దివ్య, మనోజ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గణనాథునికి విశేష పూజలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని నవాబుపేటలో పుల్లమ్మసత్రం మిత్రమండలి వారు ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహ నిమజ్జన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గణనాథుని కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు. యువకుల కేరింత నడుమ నిమజ్జన కార్యక్రమం ముగిసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని నెల్లూరు టౌన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

- డైకస్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రాహ్మణవీధి, ఫత్తేఖాన్‌పేట, రైతుబజారు, శివాలయం గుడి పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.
- కిసాన్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జాకీర్‌హుస్సేన్ నగర్, కిసాన్ నగర్, వేణుగోపాల్‌నగర్, ప్రశాంతినగర్, మూడో మైలు, బంగ్లాతోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయి.
- ఎన్టీఆర్ నగర్, హరనాథపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని సరస్వతీనగర్, మోడరన్ స్కూల్, బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ, హరనాథపురం, ఆదిత్యానగర్, కృష్ణమందిరం, చిల్డ్రన్స్ పార్కు, అపోలో ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయాలు ఉంటాయి.